క్లుప్తంగా

ఆలయ నిర్మాణంలో భాగస్వాములవ్వాలి



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

శంకర్‌పల్లి: అయ్యప్ప ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, శంకర్‌పల్లి మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ కోరారు. ఆలయ నిర్మాణానికి శుక్రవారం మండలంలోని మహాలింగపురం గ్రామానికి చెందిన జీ రవీందర్‌రెడ్డి 2లక్షల, 11వేల రూపాయల విరాళం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జంగయ్య, విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల క్లస్టర్ పరిధిలో పంటకోత ప్రయోగాలు



పంట దిగుబడిని తూకం వేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కేశంపేట: మండలంలోని అల్వాల క్లస్టర్ పరిధిలో గురువారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు టీ మహేందర్, డీ శివశంకర్ మొక్కజొన్న పంటలో వ్యవసాయ శాఖ అధికారులు పంట కోత ప్రయోగాలు చేశారు. ఎకరాకు 33 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏవో శిరీష, వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్, రైతులు పాల్గొన్నారు.


ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపకులు

చేవెళ్ల: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ తెలిపారు. శుక్రవారం కళాశాల వద్ద ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సౌకర్యాలు, ల్యాబ్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. డిగ్రీలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభించినట్లు తెలిపారు. దోస్త్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బీఏ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్ కోర్సులు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండేకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

షాద్‌నగర్: షాద్‌నగర్ పర్యటనకు వచ్చిన కేంద్ర భారీ పరిశ్రమ శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేకు శుక్రవారం తిమ్మాపూర్ వద్ద బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొననున్నారు. ఆయనకు పార్టీ నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, అశోక్‌గౌడ్, బాబయ్య, భూపాలాచారి పాల్గొన్నారు.

ఘన నివాళి



మాణెమ్మ భౌతిక కాయానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: మండలంలోని మాచన్‌పల్లి తండాకు చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మాణెమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, మాచన్‌పల్లి సర్పంచ్ మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ఆమె భౌతిక కాయం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

- వార్డుల్లో వసతుల కల్పనకు పెద్దపీట
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు

షాద్‌నగర్: షాద్‌నగర్‌ను ఆదర్శ మున్సిపాలిటీ తీర్చిదిద్దుతానని, వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 2, 16, 18 వార్డులో ఎమ్మెల్యే బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే బస్తీ బాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని వార్డులను విడతల వారీగా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, విశ్వం, కమిషనర్ వెంకన్న, నాయకులు కిషోర్, శ్రీశైలం, వెంకట్‌రావు, ప్రకాష్‌గౌడ్, శంకర్, నర్సింహ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణంలోని కాలేజీ రోడ్డుకు చెందిన విద్యాసాగర్‌కు రూ. 1.50లక్షలు, ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డికి రూ. 20వేలు మంజూరు కాగా ఇందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

హామీల అమలులో విఫలం

- కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి
- ప్రజా వ్యతిరేక విధానాలను జనంలోకి తీసుకెళ్లాలని పిలుపు



నూతన కమిటీ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్య పరచాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం కుందేలు కుంట తండాలో కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా పార్టీలు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఈ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని అన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని పిలుపునిచ్చారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా తులసీరాం, ఉపాధ్యక్షులుగా రాజు, లోకేష్, లష్కర్, నరేష్, ప్రధాన కార్యదర్శిగా సూర్య, సహాయ కార్యదర్శులుగా శివ, దాసు, శ్రీను, కోశాధికారిగా శ్రీను, సభ్యులుగా దశరథ్, వెంకటేష్, రమేష్, రాందాస్, పెంట్యా, రవిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దర్శన్, నాయకులు రాములు, గోపి, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: సొంత ఇళ్లు లేక గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి డిమాండ్ చేశారు. చేవెళ్లలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని భూపోరాటం చేస్తున్న పేద ప్రజల పోరాటం శుక్రవారానికి 95వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. ఇళ్ల స్థలాల కోసం చాలా రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కనీస సౌకర్యాలు లేకున్నా గుడిసెల్లో ఉంటున్నారని చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 750 మంది వరకు ఇళ్ల స్థలాల కోసం పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. వెంటనే వారికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, సత్తిరెడ్డి, మక్బుల్, సుధాకర్‌గౌడ్, సుభాన్‌రెడ్డి, అంజయ్య, శివ, శ్రీను, మంజుల, మాధవి, సాయిలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో వీధి దీపాల ఏర్పాటు



వీధి దీపాల ఏర్పాటును పరిశీలిస్తున్న కౌన్సిలర్ అమృతారెడ్డి తదితరులు

శంషాబాద్: ఎయిర్‌పోర్టు కాలనీ 15వ వార్డు పంచవటీ పార్కు వద్ద స్థానిక కౌన్సిలర్ అమృతారెడ్డి తన సొంత డబ్బులతో 40 వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. ఇటీవల పంచవటీ పార్కు వద్ద గుర్తు తెలియని దుండగులు ఎయిర్‌పోర్టు కాలనీ, కొత్వాల్‌గూడ వాసులపై దాడులు చేసి భయాందోళనకు గురిచేశారు. పంచవటీ పార్కు వద్ద వీధి దీపాలు లేకపోవడమే దీనికి కారణమని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తన సొంత డబ్బుతో వీధి దీపాలను కౌన్సిలర్ ఏర్పాటు చేయించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వీధి దీపాల ఏర్పాట్ల పనులను మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు పర్యవేక్షించారు.

ఉత్తమ విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకం

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నత మార్కులు సాధించిన పేద విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ఓ దాత ముందుకొచ్చారు. నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 8.5 జీపీఏ సాధించిన ఎ.అఖిలకు రూ.6 వేలు, 7.3 జీపీఏలు సాధించిన పల్లవి, జయశ్రీలకు రూ.4వేల చొప్పున కోకాపేటకు చెందిన భానుమూర్తి అందజేశారు. ఉన్నత చదువులు చదివించేందుకు రూ. 2లక్షల వరకు ఖర్చు చేస్తానని దాత పేర్కొన్నారని ప్రధానోపాధ్యాయురాలు కళావతి వివరించారు. ఉపాధ్యాయులు మాధవరెడ్డి, బల్వంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మణికొండలో మజ్జిగ వితరణ చేస్తున్న సిబ్బంది

మణికొండ: ఎండవేడి నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ మజ్జిగ పంపిణీ చేపట్టింది. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చౌరస్తాలో శుక్రవారం వీఫర్‌యూ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మజ్జిగను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు బాపూజీ, కార్యదర్శి సీతారాందాస్, కోశాధికారి దిలిప్ కక్కడ్, సభ్యులు లక్ష్మణ్‌రావు, సాంబశివరావు, నాగేంద్రరావు, విజయలక్ష్మి తదితరులున్నారు.

111 జీవో ఎత్తివేత ఎన్నికల డ్రామా

పీసీసీ సభ్యుడు సిద్ధేశ్వర్

మొయినాబాద్: 111 జీవోను ఎత్తివేసినట్లు ప్రకటించి సీఎం కేసీఆర్ ఎన్నికల డ్రామాకు తెరలేపారని చేవెళ్ల నియోజకవర్గం పీసీసీ సభ్యుడు రాచమల్ల సిద్ధేశ్వర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చిత్తశుద్ధితో 111 జీవోను ఎత్తివేస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కానీ ఎన్నికల ముందు జీవోను ఎత్తివేస్తున్నామని చెప్పి సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గతంలోనే 111 జీవో ఎత్తివేశామని అసెంబ్లీలో ప్రటించి 69 జీవో తీసుకొచ్చారని.. కానీ ఆ జీవో విధివిధానాలేమీ చెప్పలేదన్నారు. ఇప్పుడు మరోసారి 111 జీవోను ఎత్తివేశామని చెప్పి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇళ్ల నిర్మాణాలకు, లే అవుట్లకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణాలు, లేఅవుట్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వనంత వరకు 111 జీవో ఉన్నట్లేనని ఆయన పేర్కొన్నారు.

25న యూరియా బస్తాల వేలం

నందిగామ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో గతంలో సీజ్ చేసిన వేప పూతతో కూడిన యూరియా బస్తాలను ఈ నెల 25న వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య, ఏఓ గోపాల్ శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. గతేడాది నందిగామ పోలీసులు స్వాధీనం చేసుకున్న 303 బ్యాగుల వేపపూతతో కూడిన యూరియాను న్యాయస్థానం ఆదేశాల మేరకు వేలం వేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉదయం 11గంటలకు వేలం వేయనున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నూజివీడు సీడ్స్ పరిశ్రమలో తనిఖీలు

నందిగామ: విత్తన తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలు తయారు చేయవద్దని వ్యవసాయ శాఖ మండల అధికారి గోపాల్ సూచించారు. నందిగామ శివారులోని నూజివీడు సీడ్స్ పరిశ్రమను స్థానిక ఇన్‌స్పెక్టర్ రామయ్యతో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిశ్రమలో తయారయ్యే విత్తనాలు, నమూనాలను పరిశీలించారు. అనంతరం స్టాక్, యూనిట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

సబ్సిడీపై జనుము విత్తనాలు

చేవెళ్ల: వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు 65శాతం సబ్సిడీపై జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో తులసి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మండలానికి 200ల బస్తాలు జనుము విత్తనాలు వచ్చినట్లు చెప్పారు. ముడిమ్యాల పీఏసీఎస్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఏఈఓల వద్ద రసీదు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. 40కిలో బస్తాకు సబ్సిడీ పోను రూ. 1,225లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 20నుంచి ఆయా రైతు వేదికల వద్ద విత్తనాలు సరఫరా చేయనున్నట్లు ఏవో చెప్పారు.

వృద్ధురాలి ఆత్మహత్య

చేవెళ్ల: ఆరోగ్యం సరిగ్గా లేని ఓ వృద్ధురాలు ఇంట్లో చెప్పకుండా వెళ్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపల్లికి చెందిన కే జంగమ్మ(50) 15ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. గతంలో భర్త చనిపోవడంతో కొడుకు నర్సింలు వద్ద ఉంటోంది. సాయంత్రం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి వరకు రాలేదు. దీంతో ఆమె కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం తెల్లవారుజామున బావిలో మృతదేహం లభించింది. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్

- చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

మొయినాబాద్: జీవో 111ను ఎత్తివేసి సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 111 జీవో ఎత్తివేయడం హర్షణీయమన్నారు. హైదరాబాద్‌కు తాగునీరు అందించడం కోసం నిర్మించిన గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిరక్షణ కోసం ఉమ్మడి రాష్ట్రంలో 111 జీవో తీసుకొచ్చారని తెలిపారు. ఈ జీవో వల్ల 84 గ్రామాల్లో వ్యవసాయం చేయాలన్నా, ఇళ్లు నిర్మించుకోవాలన్నా ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. జీవో ఎత్తివేయాలని అనేక ఉద్యమాలు చేపట్టామన్నారు. ప్రజల బాధలు తెలిసిన కేసీఆర్ జీవోను ఎత్తివేయడం జరిగిందన్నారు. 111 జీవో ఎత్తివేతతో ఈ ప్రాంతం మహానగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారన్నారు. నియోజకవర్గం ప్రజల తరఫున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు మోహన్‌గౌడ్, డప్పు ఆనంద్, నాయకులు నీలకంఠం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఐ గురువయ్యగౌడ్, ఏఓ వెంకటేశం

- సీఐ గురువయ్యగౌడ్, ఏవో వెంకటేశం

షాబాద్: ఫెర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, విత్తనాలనే అమ్మాలని షాబాద్ సీఐ గురువయ్యగౌడ్, ఏఓ వెంకటేశం పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్‌లోని వివిధ ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్‌ను పరిశీలించడంతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలన్నారు. రైతులకు అధిక దిగుబడులు వస్తాయని మాయమాటలు చెప్పి కల్తీ విత్తనాలు అంటగట్టవద్దని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాల్లో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేద్దాం



మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కృష్ణ తదితరులు

- ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ

నందిగామ: చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్షం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 22న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు కే కృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన నందిగామలో శుక్రవారం మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూటకో మాట మార్చుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, ఎంపీటీసీలు కుమారస్వామి గౌడ్, చంద్రపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉన్నత లక్ష్యంతో సాగితే ఉజ్వల భవిష్యత్



విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చేవెళ్ల: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ సి.జైపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. చేవెళ్లలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం మూడో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సరైన మార్గాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత లక్ష్యంతో సాగితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికే యోగా



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శ్రీ శారదాధామంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి సంస్కార సాధనా వర్గ ముగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో అద్భుతమైన శక్తి ఉందని ఆ శక్తిని బయటకి తీయడానికి అనేక వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు రూపొందించామన్నారు. బాలబాలికలకు సంస్కార సాధనలో అభ్యాసం చేపిస్తున్నామన్నారు. మానసిక వికాసం కోసం యోగా, మనోమయ వికాసానికి సంగీతం వేదగణితం, గుణాత్మక వికాసానికి కథలు చెబుతూ.. చక్కటి పౌరులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాభారతి అఖిల భారత సదస్సుల కార్యదర్శి కాశీపతి, సరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి రావు, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి రవీంద్రశర్మ తదితరులున్నారు.